క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ పర్యటన

సింగరేణి(కొత్తగూడెం): వార్డుల విజిట్ ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని రామవరం 10వ వార్డులోని నెహ్రూబస్తీ, లక్ష్మీటాకీస్ ఏరియా, బర్మా క్యాంపు, నాగయ్య గడ్డకాలనీలలో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ నేతృత్వంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన సమస్యలైన కిన్నెరసాని నీటి సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను, సైడ్ డ్రెయిన్, రోడ్లు, ఓపెన్ జిమ్ మొదలైన సమస్యలను వార్డు ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిధులతో ముడిపడిన సమస్యలను నిధులు వచ్చిన తరువాత వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్, ఏఈలు సాహితి, రాము, ఎస్సై అశోక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కలాం, మధుకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు మోడెం కొట్టించాలి



ధర్నా చేస్తున్న ప్రజాపంథా కార్యకర్తలు

ఇల్లెందురూరల్: యాభై ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని కొమరారం గ్రామంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించి అటవీశాఖ కొమరారం రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి నాయిని రాజు మాట్లాడుతూ.. సకాలంలో తునికాకు మోడెం కొట్టించాలని, ఆకు సేకరణ, ఇతర పనులకు ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను కల్లాల వద్దనే అందించాలని, ఆకు సేకరణ సమయంలో ప్రమాదానికి గురై కూలీలు మరణిస్తే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, శ్రీరాంకోటయ్య, పూనెంకుమార్, అజ్మీర బిచ్చా, వాంకుడోత్ అజయ్, బుర్ర రాఘవులు, ఇస్లావత్ కోటేష్, కుంజ సమ్మయ్య, మోడెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..


మాట్లాడుతున్న రమేష్ కుమార్ మక్కడ్

కొత్తగూడెంటౌన్: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్ అన్నారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన భారత రాజ్యాంగ రక్షణ వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాచీన భారత రాజ్యాంగం, శిక్ష్యాస్మృతి పేరిట మనుస్మృతిని ముందుకు తెస్తున్నారని ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో వేల్పుల భాస్కర్, మల్లెల రామనాథం, కూసపాటి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, రమేష్‌నాయక్, కురిమెల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌లో నీటి ఎద్దడి నివారణకు జెడ్పీ, గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటారును జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో మిషన్ భగీరథ పైపుల నుంచి తాగునీటి సరఫరా కావడం లేదని స్థానికులు తెలియజేయడంతో జెడ్పీ నిధులతో బోరు వేయించడం జరిగిందని చెప్పారు. గ్రామపంచాయతీ నిధులతో దానికి మోటారు బిగించి ప్రజలకు నీటిని అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయం స్వాతి, ఎంపీటీసీలు మండల రాముమహేష్, పూనెం సురేందర్, స్థానికులు శారద, శాంతమ్మ, సాంబమూర్తి, సూర్యం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ సీఈకి సన్మానం

పాల్వంచ: మణుగూరులోని బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్నను టీఎస్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, బొకే అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జెన్‌కో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, గేమ్స్ సెక్రటరీ ఎస్.సీతారామిరెడ్డి, సెంట్రల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, బి.రాధాకృష్ణ, దామోదరాచారి, కె.నాగేశ్వరరావు, డి.శ్యాం సుందర్‌రావు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న వానర సైన్యం

- పూలు, కూరగాయల మొక్కలను ధ్వంసం చేస్తున్న కోతులు
- ఇళ్లు, దుకాణాలకు మెష్‌లతో రక్షణ కవచాలు


ప్రధాన రహదారిలో కోతుల సమూహం

ఇల్లెందురూరల్: పగలూ..రాత్రి తేడా లేకుండా పల్లెల్లో వానర సైన్యం హడలెత్తిస్తున్నాయి. ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. గ్రామాలలో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడటంతోపాటు ఇళ్లల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. పండ్ల తోటలు, పంటచేలను నాశనం చేస్తున్నాయి. తలుపు తెరిచి ఉంటే చాలు ఇంట్లో జొరబడి తినుబండారాలను ఎత్తుకెళుతున్నాయి. గృహోపకరణాలను ధ్వంసం చేస్తున్నాయి. అడ్డగించే ప్రయత్నం చేస్తే మనుషులపై దాడి చేస్తున్నాయి. కోతుల భయంతో ఇళ్లకు మెష్ డోర్లు, గ్రిల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామాల్లోని పెంకుటిళ్లను వానరాలు నాశనం చేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల పైకప్పులను కాపాడుకునేందుకు టార్పాలిన్‌తోపాటు కంప వేస్తున్నారు. కొందరు పెంకులపై సిమెంట్ కూడా వేయించుకుంటున్నారు. అయినా వాటి తీవ్రత తగ్గకపోవడంతో ఇంటి చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకుంటున్నారు. బడికి వెళ్లే విద్యార్థుల సంచులు, టిఫిన్ బాక్స్‌లను లాక్కెళుతున్నాయి. ప్రతిఘటిస్తే కరిచిన సందర్భాలూ ఉన్నాయి. గ్రామాల్లో కోతుల సంచారం అధికం కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయం..

ప్రస్తుతం గ్రామాల్లో వృద్ధులు, చిన్నారులు కాలినడకన బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర పట్టుకోక తప్పడం లేదు. ముఖ్యంగా వాకింగ్ చేసేవారిలో వయోభేదం లేకుండా చేతికర్రను వెంటపెట్టుకోక తప్పని పరిస్థితి. ఏ వీధిలో చూసినా వనారాలే దర్శనమివ్వడంతో గమ్యం చేరుకునే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయంభయంగా రోడ్డుపై నడవాల్సి వస్తోంది. గతంలో కోతులను భయపెట్టేందుకు కొండముచ్చులను వీధుల్లో తిప్పేవారు కానీ నేడు వాటికి కూడా కోతులు భయపడటం లేదు. దీంతో ప్రజలు కోతులను రక్షించుకునేందుకు కర్ర, గుల్బర్‌లను ప్రస్తుతం ఆయుధంగా వినియోగించక తప్పడం లేదు. ప్రస్తుతం ఏ పల్లెలో చూసినా కోతల బెడదే ప్రధాన సమస్యగా మారింది. వాటి సంఖ్య అంతలా పెరుగుతూ వస్తోంది. కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేందుకు గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించినా మళ్లీ..

గ్రామపంచాయతీల్లో నిధులు లేక ప్రస్తుతం కోతులను పట్టించడం లేదు. కానీ పట్టణాల్లో పట్టుకునేందుకు ఆయా మున్సిపాలిటీలు చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేదు. ఇల్లెందు, సింగరేణి, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వేర్వేరుగా గతంలో పెద్దమొత్తంలో నిధులు వెచ్చించి కోతులను పట్టించాయి. అంతేకాకుండా పట్టణానికి శివారు ప్రాంతాల్లోని గ్రామాల్లోనూ గ్రామ పంచాయతీ నిధులతో కోతులను పట్టించారు. కానీ ఏడాది గడిచే సరికి కోతుల సంఖ్య ఎప్పట్లానే ఉంది.


షాపుకు ఏర్పాటు చేసుకున్న మెష్

కోతులతో ఇబ్బంది పడుతున్నాం



కోతుల సంచారం అధికమైంది. ఇంటికి, దుకాణానికి రక్షణగా ఇనుప మెష్‌లు ఏర్పాటు చేసుకున్నా ఇబ్బందులు తప్పడం లేదు. వీధులలో వెళుతుంటే వెంటపడి గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి వాటిని నియంత్రించాలి.

– వెంకటేశ్వర్లు, బాలాజీనగర్

ఇంటిని గుల్ల చేస్తున్నాయి



గ్రామాల్లో కోతులు సమూహంగా సంచరిస్తున్నాయి. ఇంటి ఆవరణలో ఇష్టంగా పెంచుకునే పూలమొక్కలను పీకేస్తున్నాయి. కూరగాయల మొక్కలను, గృహోపకరణాలను చిద్రం చేస్తున్నాయి. అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలి

– వెంకటలక్ష్మి, తిలక్‌నగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



గ్రామాల్లో కోతులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. వారి అనుమతితో కోతులను పట్టించేందుకు చర్యలు తీసుకుంటాం. స్థానిక యువతను ఐక్యం చేసి కోతులను అడవులకు తరిమేలా ప్రయత్నం చేస్తాం.


– అప్పారావు, ఎంపీడీఓ, ఇల్లెందు

క్వాలిటీ జీఎంకు ఆత్మీయ వీడ్కోలు


నారాయణరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఎస్ఓటూ జీఎంగా పనిచేస్తూ కార్పొరేట్ క్వాలిటీ జీఎంగా పదోన్నతిపై వెళ్లుతున్న ఆర్.నారాయణరావుకు కార్యాలయం అధికారులు, సిబ్బంది గురువారం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్ మాట్లాడుతూ.. నారాయణరావు ఏరియాలో వివిధ హోదాలలో సంస్థ అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. మరెన్నో పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, సీనియర్ పీఓలు మజ్జిగ మురళి, జి.సుధాకర్, బి.సుందర్, ఎస్.శ్రీనివాస్‌రావు, అనూష, ఎ.కల్యాణి, లవణ్‌కుమార్, సాగర్, ఎస్‌డీ రెహమాన్, రామల్ రాంప్రసాద్, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి


డీఎస్పీకి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: ప్రగతిభవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, యువజన విభాగాల నాయకులు, విద్యార్థి విభాగం కన్వీనర్ సంకుబాపన అనుదీప్, వేముల హరీష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న ఎన్నో చారిత్రక కార్యక్రమాల రూపకల్పనకు నిలయంగా ఉన్న ముఖ్యమంత్రి అధికారిక నివాసం ప్రగతిభవన్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇస్లావత్ సాంబశివ నాయక్, వద్ది వెంకటేష్, బడికెల శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు..

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌ను విమర్శిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాములునాయక్ గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిస్తే, బీఆర్ఎస్ నిర్ణయాలను ధిక్కరించిన కొందరు మాత్రం తామే గెలిపించామని చెప్పుకోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సహకారంతో పదవులు దక్కించుకున్న వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న వైరాలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ శ్రేణులు ఎవరూ వెళ్లబోరని తెలిపారు. జెడ్పీటీసీ భూక్యా కళావతి, ఎంపీపీ లావుడ్యా సోనీ, వైస్ ఎంపీపీ గాదె నిర్మల, యల్లంకి సత్యనారాయణ, రోకటి సురేష్, వేల్పుల నరసింహారావు, ఎదళ్లపల్లి వీరభద్రం, బానోత్ నరసింహారావు, ధరావత్ రోజా, గలిగె సావిత్రి, దుద్దుకూరి కృష్ణప్రసాద్, దేవరకొండ కిరణ్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు


కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం జిల్లా విద్యాశాఖ పాత కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ సంక్షేమానికి యూనియన్ విశేషమైన కృషి చేస్తోందని, పీఆర్‌సీ, సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ ఇప్పించిన ఘనత సంఘానిదేనన్నారు. కార్యక్రమంలో బి.రవి, ఓ.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రత్న, మోహన్‌బాబు, నర్సయ్య, ఎ.వెంకటేశ్వరు, జహంగీర్ షరీఫ్, సంజీవరావు పాల్గొన్నారు.

ఇల్లెందు: పీఆర్‌టీయూ ఆవిర్భవించి 52 ఏళ్ల కాలంలో ఎంతో మంది ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి అండగా నిలిచిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని మెయిన్‌రోడ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకల జెండాను ఆయన ఎగుర వేశారు. ఈ సందర్భంగా డీవీ మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, మోతీలాల్, వి.నాగేశ్వరరావు, అంజమ్మ, మహేష్, రవీందర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: పీఆర్‌టీయూ టీఎస్ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మండల అధ్యక్షుడు గుగులోత్ మోతీలాల్ సంఘం జెండా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంక్షేమానికి పీఆర్‌టీయూ సంఘం కృషి చేస్తోందన్నారు. రాబోయేకాలంలో మరిన్ని ప్రయోజనాలు సాధించి పెడతామని తెలిపారు. కార్యక్రమంలో టి.సర్కార్, బీఎంపీ నిర్మల, టి.రవీందర్, కె.ప్రసాద్, సత్యనారాయణ, బాలాజీ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యాన సైన్స్ ప్రాముఖ్యత వివరించడమే కాక క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

పాల్వంచరూరల్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, ఒకేషనల్ బీసీఏ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 425 మంది, కేఎల్ఆర్ సెంటర్‌లో 258 మంది విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలు రాసినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 22వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న సర్పంచ్ పద్మ

జూలూరుపాడు: అన్నారుపాడు గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ బాదావత్ దామ్లా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం దామ్లా కుటుంబాన్ని గ్రామసర్పంచ్ బానోత్ పద్మ పరామర్శించి, ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

పెన్షన్ సౌకర్యం కల్పించండి


సీఈ ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: 1999 నుంచి 2014 వరకు విధుల్లో చేరిన విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం కేటీపీఎస్ 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు, ఎండీ సమీర్, ఎస్.నారాయణ, వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, సమ్మయ్య, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థను రక్షించుకుందాం..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిరక్షణకై, కార్మిక హక్కుల సాధనకై ఈనెల 12న రుద్రంపూర్‌లో సదస్సులో హెచ్ఎంఎస్ పర్యవేక్షణలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నామని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సులో ఏడు విప్లవ కార్మిక సంఘాలతోపాటు, తెలంగాణ ఉద్యోగుల సంఘం కలిసి ఏర్పాటైన సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కార్మికులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న అనేక హక్కుల సాధన కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నామని, సింగరేణి వ్యాప్తంగా ఈ సదస్సులు నిర్వహించి, తదుపరి ఆందోళనా కార్యక్రమాల షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, టీబీజీకేఎస్ సహవాకారంతో కంపెనీ కార్మికులకు చేస్తున్న అన్యాయాలను ఎండగట్టేందుకు త్వరలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష కార్యక్రమాలు చేపడుతామని, కార్మికులు జెండాలను పక్కన పెట్టి, ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు రద్దు చేయండి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ట్రేడ్ లైసెన్స్ పేరుతో మున్సిపల్ సిబ్బంది అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజులు రద్దు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యాపారస్తులను భయభ్రాంతులకు గురిచేస్తూ ట్రేడ్ లైసెన్స్ పేరుతో నోటీసులు ఇస్తున్నారని, గత సంవత్సరం షాపులు ఏర్పాటు చేసుకున్న వారు కూడా 2019 నుంచి డబ్బులు కట్టాలని నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రతి షాప్‌కు హరితనిధి కింద సంవత్సరానికి రూ.100 కట్టాలనడం ఏంటని ప్రశ్నించారు. గతంలో కట్టిన వారికి కూడా నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. బస్తీలో చిన్నచిన్న దుకాణాలు పెట్టుకున్న వారికి కూడా నోటీసులు ఇస్తున్నారని, ఒకవైపు వందల కోట్ల నిధులు తీసుకొచ్చామని ప్రకటనలు ఇస్తూ వేలకు వేలు వసూలు చేయడం సరైంది కాదన్నారు. వ్యాపారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. సాయి, నాగుల రవికుమార్, ఆట శ్రీకాంత్, రాంబాబు, సరోజ, లక్ష్మి పాల్గొన్నారు.

సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు


ఏఈ రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాల్వంచరూరల్: మండలంలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా అమలు కాకపోవడంతో ఈ వేసవిలో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని ప్రభాత్‌నగర్ రైతులు గురువారం రూరల్ ఏఈ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... కిన్నెరసాని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిత్యం త్రీఫేస్ విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో.. తెలియని పరిస్థితి తలెత్తిందన్నారు. పంటలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని త్రీఫేస్ విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సోమ వీరారెడ్డి, నిమ్మల మోహన్‌రెడ్డి, సామ జనార్దన్‌రెడ్డి, సాయిరెడ్డి, వేట నర్సింహారెడ్డి, కొమురెల్లి సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ ధర్నా


సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

టేకులపల్లి: విద్యుత్ కోతలను ఎత్తి వేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నేత దుబాకుల ప్రసాద్, మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ కోతలను నిరసిస్తూ గురువారం టేకులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ శాఖ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటూ 24 గంటలూ విద్యుత్ కోత విధిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ కోతల వల్ల రైతాంగం, ఇతర కుటీర పరిశ్రమలవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు నీరు పెట్టుకోవాలంటే కరెంటు ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో అర్థం కాక అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు చెప్పారు. 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్పుల సుందర్, భూక్యా పంతులు, భూక్యా లాల్య, బాణోతు లింగ, ఈసం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాడేది?


మాట్లాడుతున్న పోట్ల నాగేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని అర్హులైన వారందరికి డబుల్ బెడ్‌రూంలు ఇస్తామని సీఎం కేసీఆర్ మోసం చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డులో టీడీపీ నుంచి పోట్ల నాయకత్వంలో భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ.. కేసీఆర్ నియంత కుటుంబపాలనకు చరమగీతం పాడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పేద ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, పార్టీలో చేరిన నాయకులకు కార్యకర్తలను అభినందిస్తూ, కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేబీ శౌరి, మాళోత్ రాందాస్ నాయక్, ఏనుగుల అర్జున్ రావు, కసనబోయిన భద్రం, దావుద్, షబానా, అజ్మీర సురేష్, కొమరయ్య, దుర్గ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఇల్లెందురూరల్: సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా గ్రామ శివారులో పేదలు నిర్మించుకున్న గృహ సముదాయానికి ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నబీ మాట్లాడుతూ.. నిలువ నీడ లేక పేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని వారికి తాగునీరు, విద్యుత్, రహదారి వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కోటల్ల రోడ్డుపై కోటి ఆశలు..



టేకులపల్లి మండలం తొమ్మిదో మైలుతండా నుంచి కోటల్ల గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా ఉంది. దశాబ్దాల కాలంగా ఇక్కడి ఆదివాసీలు పక్కా రోడ్డు కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. వీరు ఇల్లెందు, కొత్తగూడెం వెళ్లాలంటే ఇదే మార్గం. వర్షం పడితే వరద.. తగ్గితే బురదతో తీవ్ర ఇబ్బందులు. రెండు వైపులా కంపచెట్లు, కంకర తేలిన, గుంతల రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ మార్గం పక్కా రోడ్డుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ పీఆర్, టేకులపల్లి
సెల్ నంబర్ : 9676029621